


నేటిపత్రిక

PRGI Regd. No: APTEL/26/A0819

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక

NETIPATRIKA PRAJASEEMA-TELUGU DAILY

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 12 | గురువారం 12, ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల: 02


## పునర్నిర్మాణ దిశగా రాష్ట్రం గాడిన పడుతోంది: గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

-ఆర్థిక పరిమితుల మధ్య సంస్కరణలతో వృద్ధి పథం

-స్థూల రాష్ట్ర ఉత్పత్తి, తలసరి ఆదాయంలో పెరుగుదల

-శ్వేతపత్రాలతో గత దుష్పరిపాలన వెలుగులోకి



అమరావతి, ఫిబ్రవరి 11 ( నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసి అన్ని రంగాల్లో స్పష్టమైన ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించారని ఆయన గుర్తుచేశారు. గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి వల్ల ఏర్పడిన అసమతుల్యతలను సరిచేయడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. రుణ భారం తగ్గించి ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ వెల్లడించారు. 2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇది 10.75 శాతం వృద్ధి రేటును సూచిస్తుందని చెప్పారు. తలసరి ఆదాయం రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి నమోదైందని గణాంకాలతో వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయడానికి ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టు ఆలస్యం, విద్యుత్ రంగం సమస్యలు, సహజ వనరుల వినియోగంలో లోపాలు, మద్యం విధానాల్లో అవకతవకలు, శాంతిభద్రతల క్షీణత, మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందుంచామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీల అమలుపై దృష్టి సారించామని, పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సంపన్నం, ఆరోగ్యకరం, సంతోషకరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ పరివర్తనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిస్తూ, ఐక్య లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగుతోందని తన ప్రసంగాన్ని ముగించారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో వైఎస్సార్సీపీ నిరసన

- ప్రధాన ప్రతిపక్ష హోదాపై ఆందోళన

- శాంతి భద్రతల అంశంపై చర్చకు డిమాండ్

- నినాదాలతో మార్మోగిన అసెంబ్లీ ప్రాంగణం



అమరావతి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిన అంశంపై ప్రభుత్వం నిలదీయనివ్వడం లేదని వైఎస్సార్సీపీ నేతలు విమర్శించారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో పార్టీ శ్రేణులు నినాదాలతో మార్మోగించారు. ప్రజా సమస్యలపై సభలో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన ఈ నిరసన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రభుత్వం స్పందన ఎలా ఉంటుందో వేచిచూడాలి.

## ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు నివాళి



అమరావతి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ): తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటపాలెంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ప్రజా పక్షపాతి నాయకుడిగా ఆయన అందించిన పాలన, సంక్షేమ కార్యక్రమాలు నేటికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాయని నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన వేసిన పునాది మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతల్లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా ఉన్నారు. ఆ మహనీయుడికి అంజలి ఘటించడం తమకు గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. తెలుగు ప్రజల ఆశయాల సాధన కోసం ఎన్టీఆర్ చూపిన దారిలోనే ముందుకు సాగుతామని అన్నారు. అనంతరం అమరావతి రాజధానిలో ప్రజా పక్షాన పాలనను ముందుకు తీసుకెళ్లేందుకు అసెంబ్లీ సమావేశాలకు నేతలు బయలుదేరారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా శాసనసభ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. తెలుగు ప్రజల అభ్యున్నతే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## ఏపీ అసెంబ్లీ సమావేశాలకు శ్రీకారం - గవర్నర్ ప్రసంగం

- అజెండా ఖరారు చేయనున్న వ్యాపార సలహా సంఘం

- ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ మధ్య కీలక భేటీ



అమరావతి, ఫిబ్రవరి 11 (ప్రజాసీమ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై గవర్నర్ వివరణ ఇచ్చారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు. సమావేశాల అజెండాను ఖరారు చేసేందుకు వ్యాపార సలహా సంఘం సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో అసెంబ్లీ సమావేశాల వ్యవధి, చర్చించాల్సిన అంశాలు, బడ్జెట్ ప్రణాళిక తదితర విషయాలపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశం అనంతరం ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఇదిలావుండగా, అసెంబ్లీ ప్రాంగణంలోని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయానికి మంత్రి నారా లోకేశ్ వెళ్లారు. తాజా రాజకీయ పరిణామాలు, బడ్జెట్ సమావేశాల్లో ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. రానున్న రోజులలో సభలో జరిగే చర్చలకు సంబంధించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది.

## గవర్నర్ ప్రసంగం డొల్లగా ఉంది: వైఎస్ షర్మిల

- కూటమి ప్రభుత్వానికి దిశ, దృష్టి లేవని విమర్శ

- సూపర్ సిక్స్ హామీలు విఫలమయ్యాయని ఆరోపణ

- ప్రతిపక్షం సభలో పోరాడాలని పిలుపు



అమరావతి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): గవర్నర్ బడ్జెట్ ప్రసంగం పూర్తిగా డొల్లగా ఉందని వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిపై దశ, దిశ లేవని, మొత్తం ప్రసంగం అవాస్తవాలు, కల్పితాలతో నిండిపోయిందని ఆరోపించారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమే తప్ప కొత్తదనం ఏమీలేదని అన్నారు. కూటమి ప్రభుత్వానికి విజన్ లేదని, సుపరిపాలన లేదని, సమతూకం కూడా లేకపోయిందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా విఫలమయ్యాయని, 33 వేల కోట్లతో అమలు చేస్తున్నామనడం బూటకమని పేర్కొన్నారు. నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయల భృతి హామీ అమలు కాలేదని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాల కింద లక్షలాది మందికి న్యాయం జరగలేదని ఆరోపించారు. మెగా డీఎస్సీ హామీ కూడా అమలు కాలేదని, ఉద్యోగ క్యాలెండర్‌పై స్పష్టత లేదని అన్నారు. పేదరిక నిర్మూలన పేరుతో చేస్తున్న ప్రకటనలు మోసపూరితమని, లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాల హామీలు కల్పితమని వ్యాఖ్యానించారు. ఆరోగ్య రంగంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో ఆరోగ్యశ్రీ వంటి పథకాన్ని దెబ్బతీశారని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించడం రాష్ట్రానికి నష్టం కలిగించిందని, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. గ్రామీణ ఉపాధి, వ్యవసాయ రంగాల్లోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ట్రూ అప్, ట్రూ డౌన్ పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. రైతులు మార్కెట్‌లో ఇబ్బందులు పడుతున్నా సరైన చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రతిపక్షం సభలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాల్సిన బాధ్యత ఉందని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ప్రజల అజెండాతో శాసనసభకు వెళ్లి అధికార పక్షాన్ని నిలదీయాలని సూచించారు. సభకు వెళ్లే ధైర్యం లేకుంటే రాజీనామాలు చేయాలని వైఎస్ జగన్‌ను ఆమె కోరారు.

## జర్మనీ కాన్సుల్ జనరల్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

- స్వచ్ఛ శక్తి, ఆధునిక తయారీ రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ

- నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై దృష్టి

- భారత్--జర్మనీ వృద్ధి కథలో కీలక భాగస్వామిగా ఆంధ్రప్రదేశ్ సిద్ధం



అమరావతి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌ను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మరియు జర్మనీ మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చలు జరిగాయి. స్వచ్ఛ శక్తి, ఆధునిక తయారీ, నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరస్పర భాగస్వామ్య అవకాశాలపై మంత్రి చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉన్నదని, ఈ రంగాల్లో జర్మనీతో కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని తెలిపారు. భారత్--జర్మనీ వృద్ధి ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇరు పక్షాలు భవిష్యత్‌లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

## తక్షణ ఆనందాల కోసం దీర్ఘకాల విలువలకు దూరం

ఆధునిక ప్రపంచం మనిషికి ఎన్నో సౌకర్యాలు అందించింది. ఒక క్లిక్‌తో సమాచారం, క్షణాల్లో వినోదం, వెంటనే కొనుగోలు, త్వరిత ఫలితాలు ఇవన్నీ మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ వేగం సౌకర్యాన్ని ఇచ్చినా, అదే వేగం మన ఆలోచనలను కూడా ప్రభావితం చేస్తోంది. ఎదురు చూడలేని తత్వం పెరుగుతోంది. తక్షణ సంతృప్తి పొందాలనే ఆతురత జీవితానికి కేంద్రంగా మారుతోంది. ఈ క్రమంలో మనం క్రమంగా కోల్పోతున్నది దీర్ఘకాల విలువలేనా అన్న ప్రశ్న ఆలోచనాత్మకంగా నిలుస్తోంది. ఒకప్పుడు విజయానికి ఓర్పు అవసరం. సంబంధాలకు సమయం అవసరం. లక్ష్యాలకు కష్టపడటం సహజం. ఇప్పుడు మాత్రం వెంటనే ఫలితం రావాలని ఆశించడం పెరిగింది. క్షణిక ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలు, తాత్కాలిక సంతోషం కోసం చేసే రాజీలు శాశ్వత విలువలను దెబ్బతీస్తున్నాయి. మనసు కోరిన వెంటనే అందుబాటులోకి వచ్చే ప్రపంచం మనలో సహనాన్ని తగ్గిస్తోంది. ఈ సహనం కోల్పోతే, సంబంధాలు, లక్ష్యాలు, జీవితం అన్నీ అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. సంబంధాల విషయంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు కుటుంబం అనేది ఓర్పు, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడంపై నిలబడేది. ఇప్పుడు చిన్న అపార్థం కూడా పెద్ద దూరానికి దారి తీస్తోంది. క్షణిక కోపం, తక్షణ భావోద్వేగం ఆధారంగా తీసుకునే నిర్ణయాలు శాశ్వత అనుబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. సంబంధాలు కష్టమైనవని భావించి, సులభ మార్గాన్ని ఎంచుకోవడం పెరుగుతోంది. ఇది కుటుంబ వ్యవస్థకు సవాలుగా మారుతోంది. వినియోగ సంస్కృతి ఈ పరిస్థితిని మరింత బలపరుస్తోంది. అవసరానికి మించిన కొనుగోళ్లు, సామాజిక పోలికలు, ఇతరుల జీవితాలతో తులన మనలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఉన్నదాన్ని ఆస్వాదించకుండా, మరింత కావాలనే తాపత్రయం పెరుగుతోంది. ఈ తపన సంతృప్తిని తగ్గిస్తోంది. కృతజ్ఞత, మితవ్యయం, పరిమిత జీవన శైలి వంటి విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆనందం అనేది వస్తువులతో కొలవబడే స్థితికి చేరుకుంటోంది. పిల్లలు, యువత ఈ మార్పుల మధ్య పెరుగుతున్నారు. తక్షణ ఫలితాల ప్రపంచంలో వారు ఎదురు చూడడం నేర్చుకోవడం కష్టమవుతోంది. కష్టపడి సాధించడమే విజయం అన్న భావన కంటే, సులభంగా పొందడమే ఆనందమన్న భావన పెరుగుతోంది. దీర్ఘకాల లక్ష్యాలకు కట్టుబడి ఉండే సామర్థ్యం తగ్గిపోతే, భవిష్యత్తు సమాజం స్థిరత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఓర్పు, క్రమశిక్షణ, కష్టానికి గౌరవం ఇవన్నీ చిన్నప్పటినుంచే నేర్పాల్సిన విలువలు. తక్షణ ఆనందం తప్పు కాదు. జీవితం సంతోషంగా ఉండాలి. కానీ ఆ ఆనందం కోసం శాశ్వత విలువలను త్యాగం చేయడం సమంజసం కాదు. ఓర్పు లేకపోతే ప్రేమ నిలబడదు. క్రమశిక్షణ లేకపోతే విజయం నిలబడదు. నిబద్ధత లేకపోతే సంబంధాలు నిలబడవు. దీర్ఘకాల దృష్టి లేకపోతే సమాజం దిశ కోల్పోతుంది. సమాజం ఈ సత్యాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది. వేగం అవసరం, కానీ దిశ కూడా అవసరం. ఆనందం కావాలి, కానీ విలువలతో కూడిన ఆనందం కావాలి. కుటుంబాల్లో సంభాషణలు పెరగాలి. పిల్లలకు ఎదురుచూడడం నేర్పాలి. తక్షణ సంతోషం కంటే శాశ్వత సంతృప్తి గొప్పదని తెలియజేయాలి. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా తక్షణ ఆనందాల కోసం దీర్ఘకాల విలువలను కోల్పోవడం ఒక మౌన సంక్షోభంగా మారుతోంది. సౌకర్యం పెరిగింది, కానీ సహనం తగ్గింది. వస్తువులు పెరిగాయి, కానీ సంతృప్తి తగ్గింది. ఈ విరోధాభాసాన్ని సరిచేసుకోవడం సమాజానికి అత్యవసరం. ఆనందం తాత్కాలికం కావచ్చు, కానీ విలువలు శాశ్వతం. ఆ శాశ్వత విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడే జీవితం నిజమైన అర్థాన్ని పొందుతుంది.

# ఒత్తిడి లేని చదువులు కావాలి- బీటీఏ




రాయచోటి ఫిబ్రవరి 11(ప్రజాసీమ): పబ్లిక్ పరీక్షల పేరుతో పదవ తరగతి విద్యార్థుల పైన ఒత్తిడి ని తగ్గించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర అన్నారు. రాయచోటిలోని కొత్తపేట బీటీఏ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని చదువులు అందించాలని పబ్లిక్ పరీక్షలు పేరుతో వారి పైన ఒత్తిడి తీసుకురాకూడదని వచ్చే విద్యా సంవత్సరం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక బదులుగా 200 రోజుల కార్యాచరణ ప్రణాళికను పదవ తరగతి విద్యార్థులకు విద్యాసంవత్సర ప్రారంభదశ నుండే అమలు చేయాలన్నారు. అందులో ప్రయోగశాల కృత్యాలు, క్షేత్ర పర్యటనలు, విహార యాత్రలు, ఉండాలన్నారు. ప్రతి పాఠ్యాంశము పూర్తైన తర్వాత పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో భయాన్ని పోగొట్టాలన్నారు. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ప్రయోగశాల కృత్యాలకు అవసరమైనటువంటి సామాగ్రిని ప్రతి పాఠశాలకు తప్పకుండా అందించాలన్నారు. విద్యార్థుల మానసికోల్లాసానికి అవసరమైన క్షేత్ర పర్యటనలు విహారయాత్రాలను విద్యా ప్రణాళికలో భాగం చేయాలన్నారు ఈ కార్యక్రమం లో బీటీఏ నాయకులు మదన్ మోహన్ నాయక్,శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.

# తాలూకా ఎస్సైలను సన్మానించిన బేడా,బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ధూపం రాజు



కడప, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ:- కడప నగర తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్సైలు జె.మోహన్ కుమార్ గౌడ్,మొహమ్మద్ రఫీ లను బుధవారం నగరంలోని 48 డివిజన్,బుడగ కాలనీకి చెందిన బేడా,బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ధూపం రాజు మర్యాదపూర్వకగా కలిశారు. ఎస్.ఐ.లకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సంధర్భంగా ధూపం రాజు మాట్లాడుతూ ఇద్దరు సబ్ ఇన్స్పెక్టర్ల పదవీ కాలం విజయవంతంగా,సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని విన్నవించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ వ్యవస్థపై ఇంకా నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు. తమ 48 వ డివిజన్ పరిధిలో ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులు, పేదలు ఉన్నారని వారందరికీ చట్టాల పట్ల అవగాహన కలిగించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తమ అధికారులుగా పేరున్న ఇద్దరు ఎన్.ఐ.లు సామాన్య,మధ్యతరగతి ప్రజలకు తప్పనిసరిగా న్యాయం అందిస్తారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బేడా, బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు ధూపం మహేష్,పి.సురేష్,రాజేష్ పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణమే కీలకం

**- మొలకలచెరువు మండలంలో నరేగా నిధులతో నిర్మించిన రహదారిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**




ములకలచెరువు, ఫిబ్రవరి 11(ప్రజాసీమ): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణమే కీలకమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని మూలకలచెరువు మండలంలో 90 లక్షల రూపాయల నరేగా నిధులతో... కదిరి రోడ్డు నుండి కనుగొండ రాయ స్వామి దేవాలయం వరకు నిర్మించిన రహదారిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నరేగా నిధులతో నిర్మించిన రహదారులపై పలు వివరాలను జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి దయాకర్ రెడ్డి జిల్లా కలెక్టర్కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఈ సంవత్సరం మార్చిలోగా 51 కోట్ల రూపాయల నరేగా నిధులతో పూర్తి చేయాల్సిన రహదారుల నిర్మాణాలను మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొత్తంగా 2025-26వ సంవత్సరానికి 75 కోట్ల రూపాయల నరేగా నిధులతో రహదారుల నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కార్యక్రమంలో పూర్తి చేయాల్సిన 17 పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా నిర్మాణంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే గ్రామాలతో అనుసంధానం కల్పించే రహదారులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద తక్షణ అనుమతులు పొంది పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాల నివాస ప్రాంతాలకు మౌలిక వసతులు చేరే విధంగా ప్రాధాన్యతా క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు పొంది పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల మరియు సామాజిక అభివృద్ధి సాధనలో మౌలిక సదుపాయాల నిర్మాణమే కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కడప జిల్లా కలెక్టర్ కు తప్పిన ప్రమాదం




కడప ఫిబ్రవరి 1 (ప్రజాసీమ క్రైమ్ రిపోర్టర్)కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం నందు సమావేశం కార్యక్రమం ముగిం చుకొని కడపకు తిరిగి బయలుదేరి వెళ్ళుచుం డగా మార్గం మధ్యలో చాపాడు లోని ప్రాథమి క ఆరోగ్య కేంద్రం సమీ పంలో మంగళవారం రాత్రి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కారును వెనుక వైపు వస్తున్న లారీ ఢీకొంది. కలెక్టర్ వెళు తున్న కారు ముందు కొన్ని వాహనాలు ఉన్నట్లుండి స్లో కావడం తో డ్రైవర్ కారు వేగం తగ్గించాడు. దీని వెనకాలవస్తున్న లారీ కలెక్టర్ కారును ఢీకొంది. ఈ ఘటనలో కలెక్టర్ కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు పాక్షికంగా దెబ్బతింది.

# 13 న పుల్లయ్య స్వామి ఆరాధన ఉత్సవం



సిద్ధవటం నేటిపత్రిక ప్రజాసీమ: కడప చెన్నై జాతీయ రహదారి బాకరాపేట శివారులో భాకరాపేట లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ భవానిశంకర స్వామి మరియు అవధూత పుల్లయ్య స్వామి ఆరాధన ఉత్సవం ఈనెల 13 (వెంకటరాజయ్య)ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్వామి వారిని పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు.ఉదయం 8 గంటల నుండి మేళ తాళాలతో స్వాములవారి ఊరేగింపు , తదుపరి 12గం!! నుండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమము జరుపుటకు గ్రామస్తులు నిర్ణయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని జయప్రదం చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు తెలిపారు.

# నిత్య పూజకోనకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్పెషల్ బస్సులు ఏర్పాటు

**-ఆర్టీసీ డిఎం కన్యాకుమారి**



సిద్ధవటం నేటిపత్రిక ప్రజాసీమ: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృశ్య భక్తులకు 40 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశామని కడప ఆర్టీసీ డిఎం కన్యాకుమారి తెలిపారు మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపంలోని ఆశ్రమం వద్ద బుధవారం ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్య పూజేశ్వర కోనకు 40 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని శని ఆది సోమ 3 రోజులపాటు ఏర్పాటు చేశామని కడప ఆర్టీసీ బస్టాండ్ నుండి బయలుదేరి సిద్ధవటం గ్రామ శివారులోని షాది ఖానా వద్ద ఆర్టిసి కంట్రోల్ పాయింట్ వద్దకు చేరుకుంటాయని భక్తులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మహిళలకు శ్రీ శక్తి పథకం కింద ఉచిత ప్రయాణం వెసలపాటు ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమంలో మంజుల, కంట్రోలర్ మల్లికార్జున, ఆర్టీసీ యూనియన్ ఎంప్లాయ్ బాల వెంకటేశు పాల్గొన్నారు

# వీఆర్వో గంగన్న మృతి

**-ప్రగాఢ సానుభూతి తెలిపిన రెవిన్యూ యంత్రాంగం**



సిద్ధవటం నేటిపత్రిక ప్రజాసీమ: గత కొంతకాలంగా అనారోగ్యాలతో బాధపడుతూ బుధవారం మృతి చెందడంతో మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయ పరిధిలో వీఆర్వో గా విధులు నిర్వహిస్తున్న గంగన్న అనారోగ్యాల కారణాలవల్ల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు మండల ఆర్ ఐ ప్రసాద్ బాబు మాట్లాడుతూ జ్యోతి విఆర్ఓ గా విధులు నిర్వహిస్తూ గత కొన్ని నెలలుగా అనారోగ్యాలతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన విఆర్వో గంగన్న మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు రెవిన్యూ యంత్రాంగం తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరుకున్నట్లు తెలిపారు

# వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు డ్రోన్ సేవలను పెంచాలి

**- బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పై నివేదికను వెంటనే సిద్ధం చేయాలి.**

**- వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లి, నేటిపత్రిక ప్రజాసీమ: వ్యవసాయాన్ని లాభాసాటిగా చేసేందుకు డ్రోన్ సేవలను పెంచాలని, పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని, బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పై నివేదికను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా వ్యవసాయ శాఖ , జిల్లా ఉద్యాన శాఖ , సిరి కల్చర్, ఏపీఎమ్ఐపి, పశుసంవర్ధక శాఖ,మత్స్య శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డి.ఆర్.డి.ఏ, మార్క్‌ఫెడ్ డిఎం, ప్రైమరీ సెక్టార్ల అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన మండలాల్లో నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే వంద శాతం పంట నమోదు పూర్తయిన ఆర్ఎస్‌కేల ఇంచార్జ్‌లను, పెండింగ్ ఉన్న ఆర్ఎస్‌కేలకు డిప్యూట్ చేసి, ఫిబ్రవరి 20వ తేదీలోపు పంట నమోదు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. పీఎం--కిసాన్ పథకం అమలుపై మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించకపోతే, మార్చి నెలలో జమ కావాల్సిన పీఎం--కిసాన్ నిధులు జమ కావని, కాబట్టి సంబంధిత రైతులను వెంటనే గుర్తించి, వారికి తక్షణమే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. 1,000 మెట్రిక్ టన్నుల యూరియా రాబోయే పది రోజుల్లో జిల్లాకు చేరనుందని, అవసరమైన దానికన్నా ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్కు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. డ్రోన్ ఉబెరైజేషన్ (ఐతీశీఅవ ఖఎవతీఅటఓఅశీఅ) సేవలపై మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అందుబాటులో ఉన్న డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకొని, తమ పొలాల్లో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో మందుల పిచికారీ చేసుకోవచ్చని తద్వారా మందులు ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. రైతులు ఈ ఆధునిక సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఉద్యానవన పంటల సాగుకు రైతులకు ప్రోత్సహించి,అధిక సాగు చేసే విధంగా అవగాహన కల్పించే చూడాలని ఆర్.ఎస్.కె వారి గా మాస్టర్ షీట్ లో రైతు పేరు, మొబైల్ నెంబర్, సర్వేనెంబర్ తదితర వివరాలను నమోదు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. సిరికల్చర్, మైక్రో ఇరిగేషన్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా పనిచేయాలని ఆదేశించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం సంబంధించిన నివేదికలను త్వరితగతిన తయారుచేయాలని, బర్డ్ ఫ్లూతో నష్టపోయిన కోళ్ల ఫారాలకు సప్లై చేసిన ప్రాంతాల నుండి ఎవరూ కొనుగోలు చేయకుండా, అలాగే ఆ రూట్ లోని సంబంధిత చెక్ పోస్టుల నందు సప్లై కాకుండా అలాంటి వాహనాలను అనుమతించకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్యాబ్ బుకింగ్ తరహాలో వ్యవసాయ యంత్ర సేవలు పోస్టర్ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. శివ నారాయణ, ఉద్యాన శాఖ , సిరి కల్చర్,ఏపీఎమ్ఐపి ,పశుసంవర్ధక శాఖ,మత్స్య శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డి ఆర్ డి ఎ మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**-రాజంపేట సబ్ కలెక్టర్ భావన**



సిద్ధవటం నేటిపత్రిక ప్రజాసీమ: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సిద్ధవటం మండలం లోని వంతాటిపల్లి గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజ స్వామి కోనకు ఈనెల 13 నుండి 16 తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధికారులకు సూచించారు. నిత్య పూజ కోనలో బుధవారం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భక్తుల కోసం పంచలింగాల గుడి వద్ద మరియు సన్నిధానంలో 2 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పి కొత్తపల్లి వైద్య సిబ్బందికి సూచించారు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని, పంచలింగాల గుడి వద్ద చిన్న చిన్న దుకాణదారులు భక్తులకు ఇబ్బంది లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు పంచలింగాల గుడి వద్ద నుండి సన్నిధానం వరకు రాత్రి వేళలో భక్తులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సన్నిధానంలో తోపులాటలు జరగకుండా ప్రతి ఒక్కరికి దర్శనం కలిగే విధంగా క్యూ లైన్ ఏర్పాటు చేయాలని పంచలింగాల గుడి వద్ద భక్తులు వెళ్లే కాలినడకన మార్గంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు శీతల పానీయాలు మజ్జిగ అందించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కడప ఆర్టీవో జాన్ ఇర్విన్ ఏ ఎస్ పి, మనోజ్ రామ్, నాథ్ హెగ్డే, సబ్ డి ఎఫ్ ఓ స్వామి వివేకానంద, విద్యుత్ ఏడి, సుబ్రహ్మణ్యం, ఆర్ అండ్ బి డి ఈ షేక్ షావలి, మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు, ఫారెస్ట్ రేంజర్ కళావతి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారాజు, ఎస్సై హారిక ఇంచార్జ్ ఈవో శ్రీధర్, డిఆర్ఓ ఓబులేసు ఆర్ ఐ ప్రసాద్ , డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్, ఏపీవో నరసింహులు, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తదితర మండల అధికారులు ఆలయ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు

# జిల్లాలో మహిళల భద్రత కోసం డ్రోన్ పాట్రోలింగ్ ను ఎక్కువగా అమలు చేయాలి

**- మాదకద్రవ్యాల నిర్మూలన కోసం బహుముఖ కార్యాచరణను రూపొందించి అమలు చేయాలి.**

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**


మదనపల్లి, నేటిపత్రిక ప్రజాసీమ: జిల్లాలోని కళాశాలలు, విద్యాసంస్థలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు డ్రోన్ పట్రోలింగ్‌ను విస్తృతంగా అమలు చేయాలని మాదకద్రవ్యాల నిర్మూలన కోసం బహుముఖ కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పోలీసు శాఖను ఆదేశించారు. మదనపల్లి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఉదయం... జిల్లాలో శాంతి భద్రతలు, మహిళల సంరక్షణ మాదకద్రవ్యాల నిర్మూలన, తదితర అంశాలపై జిల్లా లోని డి.ఎస్.పి లు, ఇన్స్పెక్టర్లతో జిల్లా ఎస్పి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.... జిల్లా లో ఐవీఆర్ఎస్ ద్వారా మహిళలపై నేరాలపై ప్రజల నుండి తీసుకున్న అభిప్రాయాలు, మహిళలపై నేరాలు, నివేదించబడిన కేసులు, అవగాహన కార్యక్రమాలు మరియు మాదకద్రవ్యాలపై ప్రజల నుండి తీసుకున్న అభిప్రాయాలు నమోదైన కేసులు అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళలపై నేరాలను సమూలంగా రూపు మాపేందుకు.. రెవెన్యూ శాఖ సమన్వయంతో సమగ్ర కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళా విద్యాసంస్థలు, ఆసుపత్రులు, హాట్‌స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్ నిఘాను మరింత పెంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రోన్ పట్రోలింగ్ విధానం, కేసులపై తీసుకున్న చర్యలను అవగాహన కార్యక్రమాలలో తెలియజేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై మాట్లాడుతూ.... జిల్లాలో ఇటీవల గుర్తించబడిన అక్రమ నెట్వర్కుల కార్యకలాపాలపై పోలీసు యంత్రాంగం బహుముఖ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నదని, పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పీడీ చట్టం అమలు చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులలో నేరస్తులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీప జిల్లాలు మరియు ఇతర రాష్ట్రాలలో ఉన్న ఆస్తులు, వాహనాలు తదితర వివరాలను కూడా సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. యువత పై ప్రత్యేక దృష్టి సారించాలని, గుర్తించబడిన కేసుల్లో ఎక్కువ మంది 20--30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులేనని, యువత మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరింత ఎక్కువగా మండల, గ్రామ, కళాశాల,



పాఠశాలలలో నిర్వహించాలని అన్నారు. డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుచేసి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. మాదకద్రగాలు నిర్మూలన కోసం డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని, రాత్రి వేళల్లో కూడా పట్రోలింగ్‌కు అనువైన హై కెపాసిటీ డ్రోన్లు వినియోగించుకోవాలని ఈ నేపథ్యంలో డ్రోన్ కార్పొరేషన్ ద్వారా అదనపు డ్రోన్లను తీసుకుని, అవసరమైన పోలీస్ స్టేషన్ పరిధుల్లో డ్రోన్ పట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. డ్రోన్ పట్రోలింగ్ ద్వారా ప్రజల్లో భద్రతా భావన పెరుగుతుందని, నేరాల నివారణకు ఇది ప్రభావవంతమైన చర్యగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈగల్ క్లబ్ సభ్యుల మెగా సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ, శక్తి యాప్, సైబర్ నేరాల అవగాహన సదస్సు





కడప ఫిబ్రవరి 11 (ప్రజాసీమ క్రైమ్ రిపోర్టర్)జిల్లా పోలీస్ యంత్రాంగంమహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, మహిళా పిఎస్, డి.ఎస్.పి, సీఐ, భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు, పాఠశాలలు మరియు కళాశాలల్లో 'శక్తి' యాప్ వినియో గంపై అవ గాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తు న్నారు. 'శక్తి' యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగప డుతుం దని 'శక్తి' టీమ్ హెడ్ కానిస్టేబుల్ శివశంకర్ రెడ్డి, కానిస్టేబుల్ రాజారెడ్డి, మహిళా కానిస్టేబుల్ ధనలక్ష్మి మరియు బేబీ షామిని తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై కడప నగరంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ముత్రాసుపల్లె విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. శక్తి యాప్ డౌన్ లోడ్ చేసే విధానం వివరించి మొబైల్ ఫోన్లలో డౌన్ లోడ్ చేయించారు. 'శక్తి' యాప్ ఎలా ఉపయో గించాలి ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నపుడు 'శక్తి' యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. ఈ సందర్భంగా, మ హిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్ లైన్ నంబర్లను గుర్తు చేశారు డయల్ 100/112 (అత్యవసర సహాయం) చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ) గృహ హింస 181మహిళ వేధింపులు 1091 సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930 సైబర్ మిత్ర ప్రతి మహిళ, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వ కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిని చైతన్యవంతులను చేశారు.

# నిత్యపూజ స్వామి కోన లో ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ



సిద్ధవటం నేటిపత్రిక ప్రజాసీమ: ఈనెల 15 న మహా శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా, సిద్ధవటం మండలము, వంతాటిపల్లె గ్రామ శివారు శ్రీలంకమల్ల అభయారణ్యం లో వెలిసిన శ్రీ నిత్య పూజ స్వామి కొనలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ రాజంపేట ఏఎస్పీ రామ్ నాథ్ మనోజ్ హెగ్డే తో కలిసి పరిశీలించినారు.భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ ప్లేస్, కోనలో స్వామి దగ్గరికి భక్తులు వెళ్లే మార్గము లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించి పోలీస్ అధికారులకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తగు సూచనలు, జాగ్రత్తలను తెలియజేశారు. ఎస్పీ గారు శ్రీ నిత్యపూజ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారులు ఎస్పిని శాలువాతో సత్కరించి, దేవాలయ విశిష్టతను వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకొని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పి అధికారులను ఆదేశించినారు. రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ గారు, కడప స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీ సుధాకర్, కడప స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు సదాశివయ్య, ఈదుర్ బాషా, ఒంటిమిట్ట సీఐ, నందలూరు ఎస్సై సిద్ధవటం ఎస్సై పాల్గొన్నారు.



# గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గాలివీడు ఫిబ్రవరి 11 (ప్రజా సీమ): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం గాలి వీడు మండలంలోని కుమ్మరపల్లి నుంచి బలిజబెల్లి వరకు ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎడాది కాలంలోని ఐదు కోట్ల రూపాయలతో అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు డ్రైనేజీ విద్యుత్ దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంచినీటి అద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనఅస్త్రు ఏర్పాటు చేయనున్న టిడిపి ఆఫీసును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కుమార్ రెడ్డి టిడిపి నాయకులు గీదర ధర్మారెడ్డి,శ్రీకాంత్, శివ, భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పీపీపీ విధానం ప్రజారోగ్యానికి శాపం: ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్.ఏ. సత్తార్ ధ్వజం




కడప, ప్రజాసీమ: ప్రభుత్వ వైద్యం, విద్యను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే "పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్" విధానంపై కడప ప్రెస్ క్లబ్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్.ఏ. సత్తార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ తీరుపై వక్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్య వ్యాపారీకరణపై ఆందోళన.. సమావేశంలో ఎస్.ఏ. సత్తార్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రైవేటు మెడికల్ కళాశాలలు వైద్య విద్యను పూర్తి వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. ఒక్కో మెడికల్ సీటు కోటి రూపాయలకు అమ్ముడుపోతోందని, దీనివల్ల ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు కాకుండా, కేవలం డబ్బున్న వారు మాత్రమే డాక్టర్లు అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్తులో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంపై విమర్శల బాణాలు.. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు యాజమాన్యాల చేతిలో పెట్టే కుట్ర చేస్తోందని నాయకులు మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం: గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 108, 104 వాహనాలను నిర్వీర్యం చేశారని, ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు వైద్యం నిలిపివేస్తున్నాయని పేర్కొన్నారు. మెడికల్ సీట్ల రద్దు: కేంద్రం నుండి రావాల్సిన మెడికల్ సీట్లను అడగాల్సింది పోయి, మంజూరైన వాటిని కూడా రద్దు చేసుకోవడం కక్ష సాధింపు చర్యేనని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి వేదిక అధ్యక్షులు బి. నారాయణ, వైఎస్ఆర్సీపీ మైనారిటీ నాయకులు షఫీ, ఇబ్రహీం మియా, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సగిలి గురప్ప, హేతువాద సంఘం నాయకులు సీఆర్వీ ప్రసాద్, జె.వి. రమణ (SC/ST హ్యూమన్ రైట్స్), సంఘటి మనోహర్ (మహాజన రాజ్యం పార్టీ), ఆర్ఎస్పీ నాయకులు సుబ్బరాయుడు మరియు కాంగ్రెస్ నాయకులు హమీద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్





కడప ఫిబ్రవరి 11 (ప్రజాసీమక్రైమ్ రిపోర్టర్)ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా కడప జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,ఆదేశాల మేరకు వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా, కట్టుదిట్టంగా మరియు నిరంతరంగా అమలు చేస్తున్నారు. దీని ద్వారా నేరాలకు ముందస్తు నియంత్రణ సాధించడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకుంటూ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పు తున్నారు.జిల్లావ్యాప్తంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి సహా నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, నేర ప్రవృత్తులు కలిగిన వ్యక్తులపై గట్టి నిఘా కొనసాగిస్తున్నారు. నేరాలకు తావులేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు, గస్తీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసులు సూచిస్తున్నారు. తెలియని లింకులు క్లిక్ చేయరాదని, ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డులు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పంచుకోరాదని అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజే స్తున్నారు.సైబర్ మోసాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసు లకు సమా చారం అందించాలని సూ చించారు.రహదారి ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలి. మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో శాంతి భద్రతలు మరింత పటిష్టంగా కొనసాగాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని జిల్లా పోలీసులు తెలిపారు.భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా డయల్ లి112లి కు గానీ సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 'మెడికవర్' హాస్పిటల్లో క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక వైద్య చికిత్సలు

-డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా క్యాన్సర్ కు ఉచిత వైద్యం

-ప్రముఖ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగ రామన్

-డా. రంగ రామన్ కు పూల మొక్క అందించిన డా. విజయ్ నాగేంద్ర







ప్రొద్దుటూరు , నేటిపత్రిక ప్రజాసీమ:- క్యాన్సర్ వ్యాధికి నెల్లూరులోని మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగ రామన్ అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు నగరంలోని హర్ష హాస్పిటల్స్ లో క్యాన్సర్ వ్యాధుల చికిత్స కొరకు కన్సల్టేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా తొలిసారి నగరానికి విచ్చేసిన డాక్టర్ రంగ రామన్ కు హర్ష హాస్పిటల్స్ చైర్మన్, డాక్టర్ కే విజయ్ నాగేంద్ర పూల కుండి అందజేసి స్వాగతం పలికారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారిని డాక్టర్ పరీక్షించి వారికి తగు వైద్య సలహాలు,సూచనలు అందజేశారు.16 మంది క్యాన్సర్ బాధితులు డాక్టర్ ను చికిత్స నిమిత్తం సంప్రదించారు. వారందరిని ఓపిగ్గా పరీక్షించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ రంగ రామన్ ప్రతి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ప్రొద్దటూరు నగరంలోని హర్ష హాస్పిటల్ లో తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న వారు తనను సంప్రదించి నాణ్యమైన,మెరుగైన వైద్య సేవలను పొందవచ్చని చెప్పారు.రొమ్ములో గడ్డలు, నీరు, రక్తం కారడం,గొంతు కింద గడ్డలు, థైరాయిడ్ గడ్డలు ఉన్నవారికి చికిత్సలు అందిస్తామని తెలిపారు. అలాగే నోటిలో మానని పుండ్లు,కడుపులో గడ్డలు ఉన్నవారికి ఆధునిక చికిత్సలు అందజేస్తామన్నారు.మలంలో రక్తం పడడం,నల్లగా రావడం, అధిక ఋతుస్రావంతో బాధపడుతున్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అలాగే కొందరిలో మూత్రంలో రక్తం పడడం జరుగుతుందని తెలిపారు. శరీరంలో ఎక్కడైనా మానని పుండ్లు ఉన్నవారు,పచ్చ, తెల్ల కామెర్లతో బాధపడుతున్న వారిని పరీక్షించి తగు వైద్యం అందజేస్తామని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం,ఈ.హెచ్.ఎస్ పథకం ద్వారా అన్ని రకాల క్యాన్సర్ జబ్బులకు మెడి కవర్ హాస్పిటల్స్ లో ఉచిత వైద్యం అందజేస్తామని వివరించారు. అపాయింట్మెంట్ కొరకు 8008900157, 9640540475. అనే సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో హర్ష హాస్పిటల్స్ పరిపాలన అధికారి కిరణ్ మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

-దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించాలి

-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా



శ్రీశైలం/నంద్యాల, నేటిపత్రిక ప్రజాసీమ :- శ్రీశైల బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం శ్రీశైలం కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సమన్వయంతో దేవాదాయ, అటవీ, పోలీసు, రెవెన్యూ తదితర శాఖలు సమగ్ర చర్యలు చేపట్టాయని తెలిపారు. ఈ ఏడాది కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నిన్న ఒక్కరోజే స్వామి, అమ్మవార్లను సుమారు 71 వేల మంది భక్తులు దర్శించుకున్నారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం స్పర్శ దర్శనం, అలంకార దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పర్శ దర్శనానికి కొంత సమయం ఎక్కువగా, అలంకార దర్శనం తక్కువ సమయంలో పూర్తవుతుందని చెప్పారు. అధిక రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉన్నందున భక్తులు సహనంతో వ్యవహరించాలని సూచించారు. శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో దర్శనానికి వస్తారని, అదే భక్తి భావాన్ని దర్శనం పూర్తయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే క్షేత్ర పరిశుభ్రతను కాపాడేందుకు భక్తులు ఉపయోగించిన ఆహార పదార్థాల అవశేషాలు, ప్లాస్టిక్ వస్తువులను తప్పనిసరిగా డస్ట్‌బిన్స్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రవాణా సౌకర్యం కోసం అదనంగా 460 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాల్లో కూడా ఇదే తరహా ఏర్పాట్లు చేపట్టామని, మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

# అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట

- సీఐ విధులకు ఆటంకం కేసులో బెయిల్ మంజూరు

- పోలీసుల కస్టడీ పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం

- రేపు విడుదలయ్యే అవకాశం

గుంటూరు, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట లభించింది. సీఐ విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో ఆయన్ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. గత ఏడాది నవంబర్ 12న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను అడ్డుకున్నారని ఆరోపిస్తూ అంబటి రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీటీ వారెంట్ జారీ కావడంతో పట్టాభిపురం పోలీసులు మూడు రోజుల క్రితం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ సందర్భంగా పోలీసులు కస్టడీ కోరగా, న్యాయస్థానం దానిని తోసిపుచ్చింది. అనంతరం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న అంబటి రాంబాబు, కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు విడుదలయ్యే అవకాశముందని సమాచారం. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేసు తదుపరి విచారణ తేదీని కోర్టు త్వరలో ప్రకటించనుంది

# మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

- స్పందించిన మంత్రి కందుల దుర్గేశ్

అమరావతి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ ప్రతినిధి): మావోయిస్టుల పేరుతో వచ్చిన బెదిరింపు లేఖపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పందించారు. ఈ లేఖ కారణంగా తన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. అయితే మావోయిస్టులు బెదిరింపు లేఖ రాసేంత కారణం తమ వద్ద లేదని స్పష్టం చేశారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ లేఖను పంపి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తన పర్యాటక శాఖ చిన్నదే అని గుర్తుచేస్తూ, వ్యక్తిగతంగా గానీ, శాఖాపరంగా గానీ ఎలాంటి తప్పు చేయలేదని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల ఈ బెదిరింపు లేఖ వెనుక ఇతర ఉద్దేశాలు ఉండొచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. తనకు వచ్చిన లేఖపై ఇప్పటికే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. కందుల దుర్గేశ్‌తో పాటు మరో ముగ్గురు మంత్రులకు కూడా మావోయిస్టుల పేరుతో లేఖలు వచ్చినట్లు సమాచారం. అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, కొల్లు రవీంద్రలకు కూడా ఇలాంటి బెదిరింపు లేఖలు అందినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పూర్తి స్థాయి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రజాసీమ
గురువారం 12-02-2026


# మున్సిపల్ ఎన్నికలలో పోలింగ్ ఉత్సాహం, కొన్ని చోట్ల ఉద్రిక్తతలు

**- ఉదయం నుంచే ఓటర్ల రద్దీ**

**- మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డిలో ఘర్షణలు**

**- దొంగ ఓట్ల యత్నాలు అడ్డుకున్న సిబ్బంది**



హైదరాబాద్, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: తెలంగాణలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 116 స్థానాలకు ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివస్తుండగా, ఎన్నికల సంఘం మరియు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎక్కువ ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నప్పటికీ, కొన్ని కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు నమోదయ్యాయి. సదాశివపేటలో ఓటర్లకు డబ్బులు పంచుతున్న అభ్యర్థిని ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేసేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని చెదరగొట్టారు. 19వ డివిజన్‌లో బీజేపీ ఎమ్మెల్యే సూర్యనారాయణ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేకు అనుమతి ఇచ్చి తనను అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించగా, ఇరు పార్టీల అనుచరుల మధ్య వాగ్వాదం జరిగింది. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య నినాదాలు ఉద్రిక్తతకు దారితీశాయి. రాకాసిపేట్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులను దొంగ ఓట్లు వేయకుండా సిబ్బంది అడ్డుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 నెంబరు బూత్‌ల వద్ద తోపులాటలు చోటుచేసుకున్నాయి. 14వ వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఓటర్లను ప్రలోభపెడుతున్నారనే ఆరోపణలతో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుండగా, చెలరేగిన ఘటనలను పోలీసులు అదుపులోకి తీసుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు.

# నల్గొండ 33వ డివిజన్‌లో ఓటు హక్కు వినియోగం

**- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**- మెరుగైన మౌలిక సదుపాయాల కోసం ఓటేయాలని విజ్ఞప్తి**



నల్గొండ, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నల్గొండ 33వ డివిజన్ పరిధిలోని పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. ఓటు మన ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే శక్తివంతమైన సాధనమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని వివరించారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన, అభివృద్ధి కోసం ప్రతి ఓటరు ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పండుగలో చురుకుగా పాల్గొని నగర అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# సిద్దిపేట ఐటీ టవర్‌లో స్థానిక యువతకు ఉద్యోగాల దారి

**- సౌకర్యాలపై సమీక్ష, సమస్యలపై తక్షణ చర్యలు**

**- ఐటి టవర్‌ను సందర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు**




సిద్దిపేట, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఐటి టవర్ స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే నిర్మించామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. బుధవారం ఆయన ఐటి టవర్‌ను సందర్శించి అక్కడ పని చేస్తున్న యువతతో ముచ్చటించారు. ఐటి టవర్‌లో కల్పిస్తున్న సౌకర్యాలు, కంపెనీల పనితీరు, ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా ఆరా తీశారు. సిద్దిపేటలోనే చదువుకుని ఇక్కడే ఉద్యోగాలు సాధించాలనే యువత ఆకాంక్షను నెరవేర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ఐటి టవర్‌ను ఏర్పాటు చేసినట్లు హరీష్ రావు గుర్తుచేశారు. ప్రస్తుతం ఐటి టవర్‌లో 17 సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, సుమారు 350 మంది యువత ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అదేవిధంగా సిద్దిపేటలో నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్ శిక్షణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసి నిరంతరం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పర్యటన సందర్భంగా భద్రతా సిబ్బంది మరియు ఇతర కార్మికులకు జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి జీతాలు చెల్లించాలని ఆదేశించారు. ఐటి టవర్‌లోని నాలుగు అంతస్తులను పరిశీలించిన ఆయన, యువత స్థానికంగానే ఉపాధి పొందేలా మరిన్ని సంస్థలను తీసుకురావాలని సూచించారు. స్థానిక యువత నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.

# మధిరలో ఓటు హక్కు వినియోగించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**- 9వ వార్డు ఇందిరా డైరీ పోలింగ్ కేంద్రంలో ఓటు**

**- ప్రజాస్వామ్య బలోపేతానికి అందరూ ముందుకు రావాలి**



మధిర, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరా డైరీ పోలింగ్ కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే కేంద్రానికి చేరుకున్న ఆయన, క్యూలో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని అన్నారు. ప్రతి పౌరుడు తన ఓటును బాధ్యతగా, ఆలోచనతో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి అందరూ కలిసి ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఓటు మన ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని పేర్కొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**- వర్ధన్నపేట, ఘన్పూర్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల సమీక్ష**

**- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచనలు**





వరంగల్, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బుధవారం జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో రెండు, ఘన్పూర్ మున్సిపాలిటీకి సంబంధించిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అప్రమత్తంగా ఉండాలని పోలింగ్ స్టేషన్ ఇంచార్జ్‌లకు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద చట్ట విరుద్ధ చర్యలకు తావులేకుండా క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ వెంట ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, ఏసీపీలు నర్సయ్య, భీం శర్మతో పాటు ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నా ఓటు వేరేవారు వేశారు అంటూ మహిళ ఆగ్రహం

**-ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఘటన**

**-పోలింగ్ కేంద్రంలోనే బయటపడిన వ్యవహారం**

**-సిబ్బందిని నిలదీసిన పారిజాతం**



రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఓటు వేయడానికి వెళ్లిన పారిజాతం అనే మహిళకు షాక్ తగిలింది. పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన పేరు చెప్పగా, ఇప్పటికే మీ ఓటు నమోదైందని సిబ్బంది తెలిపినట్లు ఆమె ఆరోపించారు. ఈ విషయంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైన పారిజాతం, తన వద్ద ఉన్న గుర్తింపు పత్రాలు చూపించినప్పటికీ, ఓటు ముందే నమోదైందని అధికారులు చెప్పారని వెల్లడించారు. తన హక్కైన ఓటును వేరేవారు వేయడం ఎలా జరిగిందని ప్రశ్నించారు. అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని, అయినా వేరే వ్యక్తులు ఓటు వేస్తుంటే పోలింగ్ సిబ్బంది ఏమి చేస్తున్నారని ఆమె నిలదీశారు. ఓటర్ల జాబితా ధృవీకరణ, గుర్తింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యమైన ప్రజాస్వామ్య హక్కు కావడంతో, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వెబ్ ప్రసార వ్యవస్థ ద్వారా పోలింగ్ తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ**

**- ప్రతి రెండు గంటలకు నివేదికలు ఇవ్వాలని అధికారులకు ఆదేశం**



జగిత్యాల, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: జిల్లాలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వెబ్ ప్రసార వ్యవస్థ ద్వారా పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. బుధవారం జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలలో పోలింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రం నుంచి పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల లోపల ఓటింగ్ సరళి, కేంద్రాల బయట ఓటర్ల రద్దీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను ప్రత్యక్ష చిత్రాల ద్వారా పరిశీలించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సూచించిన సమయానికి ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదికలు అందజేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మరో 15 ఏళ్లు ఐక్యంగా ఉంటేనే సుస్థిర అభివృద్ధి

-గుజరాత్ తరహా స్థిర పాలన అవసరమని ఆకాంక్ష

-శాసనసభ సమావేశాలను గంభీరంగా తీసుకోవాలని సభ్యులకు సూచన

-కేంద్ర సహకారంతో రాష్ట్రం గాడిన పడిందని వ్యాఖ్య

-నారా చంద్రబాబు నాయుడు



అమరావతి, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. అసెంబ్లీ కమిటీ మందిరంలో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో ముందుకు సాగితే గుజరాత్ తరహాలో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లో భారతీయ జనతా పార్టీ వరుస విజయాలతో స్థిర పాలన కొనసాగుతోందని ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ మూడు పార్టీలు మరో 15 ఏళ్లు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లే పరిస్థితి రావాలని, అప్పుడే రాజకీయంగా శాశ్వత స్థిరత్వం సాధ్యమవుతుందని దిశానిర్దేశం చేశారు. శాసనసభ్యులకు స్పష్టమైన సూచనలు చేస్తూ, అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు గంభీరంగా తీసుకోవాలని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభలో హాజరు కావాలని ఆదేశించారు. సభలో అంశాలపై అర్థవంతమైన చర్చలు జరగాలని, పరస్పర విమర్శలు ఉన్నా వ్యక్తిగత దూషణలకు తావివ్వకూడదని సూచించారు. త్వరలో జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు అందడంతో పనులు పురోగమిస్తున్నాయని తెలిపారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కూడా కేంద్రం విధాన మార్పులు చేసి దానికి ఊతమిచ్చిందని వెల్లడించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కూడా పాల్గొన్నారు. కూటమి ధర్మానికి కట్టుబడి ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చూపిన ఐక్యతను కొనసాగిస్తే రాష్ట్ర అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.

# సంక్షోభంలో చిన్న పరిశ్రమలు

- ఆర్థిక ఒత్తిళ్లు.. మూతపడుతున్న యూనిట్లు
- బ్యాంకు రుణాలు -- అందని ద్రాక్షలా మారుతున్నాయా?
- ఉపాధి అవకాశాలపై ప్రభావం ఎంత?







డెస్క్, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే చిన్న పరిశ్రమలు ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. తయారీ, సేవా రంగాల్లో వేలాది యూనిట్లు ఆర్థిక ఒత్తిళ్లతో నెట్టుకొస్తున్నాయి. మార్కెట్ పోటీ పెరగడం, అమ్మకాలు తగ్గడం, ఖర్చులు అధికమవడం వంటి కారణాలతో కొన్ని యూనిట్లు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఇది కేవలం వ్యాపార సమస్యగా కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధిపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది.

**- బ్యాంకు రుణాలు -- అందని ద్రాక్షలా మారుతున్నాయా?**

చిన్న పరిశ్రమలకు మూలధనం అత్యవసరం. కానీ బ్యాంకు రుణాలు పొందడం కష్టతరమవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. గట్టి అర్హత ప్రమాణాలు, తగిన భద్రతా పత్రాల అవసరం చిన్న వ్యాపారులను వెనుకడుగు వేయిస్తోంది. రుణాల మంజూరు ఆలస్యం కూడా యూనిట్ల పనితీరుపై ప్రభావం చూపుతోంది. ఫలితంగా అనేక సంస్థలు అధిక వడ్డీపై ప్రైవేట్ రుణాలవైపు మొగ్గుచూపుతున్నాయి.

**- ముడిసరుకు ధరల పెరుగుదల -- లాభాలు కరుగుతున్నాయా?**

ముడిసరుకు ధరలు, రవాణా ఖర్చులు, విద్యుత్ చార్జీలు పెరగడం చిన్న పరిశ్రమలపై అదనపు భారంగా మారింది. ఉత్పత్తి వ్యయం పెరిగినా, మార్కెట్‌లో ధరలను పెంచలేని పరిస్థితి ఉంది. ఫలితంగా లాభాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఇది సంస్థల నిలకడను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న యూనిట్లు ఈ ఒత్తిడిని మరింతగా ఎదుర్కొంటున్నాయి.

**- ఉపాధి అవకాశాలపై ప్రభావం ఎంత?**

చిన్న పరిశ్రమలు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగం బలహీనమైతే ఉపాధి అవకాశాలు కూడా తగ్గే ప్రమాదం ఉంది. యువతకు స్థానిక స్థాయిలో ఉపాధి అందించే ఈ రంగం కుదేలైతే, నిరుద్యోగం సమస్య మరింత తీవ్రం కావచ్చు. అందుకే చిన్న పరిశ్రమల స్థిరత్వం దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం.

చిన్న పరిశ్రమలు కేవలం వ్యాపార యూనిట్లు మాత్రమే కావు. ఇవి దేశ ఆర్థిక నిర్మాణానికి పునాది. సరైన విధానాలు, సకాలంలో రుణాలు, ముడిసరుకు ధరల నియంత్రణ, మార్కెట్ మద్దతు లభిస్తే ఈ రంగం మళ్లీ బలోపేతం కావచ్చు. చిన్న పరిశ్రమల సంక్షోభాన్ని పరిష్కరించడం అంటే దేశ ఉపాధి భవిష్యత్తును కాపాడుకోవడమే.

# సమయ సద్వినియోగమే దేశ అభివృద్ధికి బలమైన పునాది





డెస్క్, ఫిబ్రవరి 11నేటిపత్రిక ప్రజాసీమ: దేశ ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత వంటి అంశాలు ముందుకు వస్తాయి. అయితే వీటన్నింటికీ ప్రాణం పోసేది ఉత్పాదకత. తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలు సాధించే సామర్థ్యమే నిజమైన ఉత్పాదకత. ఈ విలువను గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జాతీయ ఉత్పాదకత దినాన్ని పాటిస్తున్నారు. పని సామర్థ్యాన్ని పెంచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, దేశ అభివృద్ధిలో ప్రతి వ్యక్తి పాత్రను గుర్తు చేసే రోజు ఇది. ఉత్పాదకత అనేది కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు. కార్యాలయాల్లో, వ్యవసాయ రంగంలో, విద్యాసంస్థల్లో, చిన్న వ్యాపారాల్లో ప్రతి రంగంలో ఇది కీలక అంశం. సమయపాలన, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, సాంకేతికత వినియోగం కలిసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. ఒక వ్యక్తి పనితీరు మెరుగుపడితే, అది సంస్థకు లాభం. సంస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు. పరిశ్రమల దృష్టిలో ఉత్పాదకత అంటే ఉత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు. నాణ్యత, సమర్థత, వ్యర్థాల నియంత్రణ కూడా అంతే ముఖ్యం. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత సాధించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యం పెరుగుతుంది. దేశ ఆర్థిక స్థిరత్వానికి ఇది కీలకం. కార్యాలయాల్లో కూడా ఉత్పాదకత ప్రధాన చర్చగా మారుతోంది. ఉద్యోగులు కేవలం గంటలు గడపడం కాదు, ఫలితాలపై దృష్టి పెట్టాలి. సమయ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జట్టు భావన ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయి. పని--వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కూడా పనితీరును మెరుగుపరుస్తుంది. అలసటతో పని చేసే వ్యక్తి కంటే ఉత్సాహంతో పని చేసే వ్యక్తి ఎక్కువ ఫలితాలు ఇస్తాడు. విద్యాసంస్థల్లో ఉత్పాదకత చర్చలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే యువతను తయారు చేయాలంటే, విద్యా వ్యవస్థలోనే ఉత్పాదకత విలువలు నాటాలి. జాతీయ ఉత్పాదకత దినం మనకు ఒక ముఖ్యమైన ప్రశ్నను వేస్తుంది. మనం చేసే ప్రతి పనిలో సమర్థత ఉందా? సమయాన్ని వృథా చేస్తున్నామా? వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతకడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థల పరంగా, దేశ స్థాయిలో మార్పు సాధ్యమవుతుంది. ఉత్పాదకత అంటే కేవలం ఎక్కువ పని చేయడం కాదు. తెలివిగా పని చేయడం. సమయాన్ని గౌరవించడం. వనరులను కాపాడడం. నైపుణ్యాలను పెంపొందించడం. ఇవన్నీ కలిసినప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ప్రతి పౌరుడు తన పనిని సమర్థంగా నిర్వహించినప్పుడే జాతీయ స్థాయిలో ఉత్పాదకత పెరుగుతుంది. మొత్తంగా జాతీయ ఉత్పాదకత దినం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది ప్రతి రోజు ఆచరణగా మారాలి. వ్యక్తిగత క్రమశిక్షణ నుంచి దేశ ఆర్థికాభివృద్ధి వరకు, ఉత్పాదకతే ప్రధాన బలం. సమయాన్ని గౌరవించే సమాజమే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.

# చుండూరు కేవన్ పల్లి కార్యకర్తలను పరామర్శించిన వైఎస్ జగన్

- దాడులపై మాజీ ముఖ్యమంత్రికి వివరించిన బాధితులు
- న్యాయం కోసం పోరాటం కొనసాగుద్దామని పిలుపు
- ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు సూచన



తాడేపల్లి, ఫిబ్రవరి 11 (నేటిపత్రిక ప్రజాసీమ: చుండూరు కేవన్ పల్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. తమపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు దాడులు చేసిన విషయాన్ని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలపై పూర్తి వివరాలు అందజేసి న్యాయం చేయాలని కోరారు. బాధితుల వాంగ్మూలాన్ని శ్రద్ధగా విన్న వైఎస్ జగన్, జరిగిన సంఘటనలపై ఆరా తీశారు. పార్టీ కార్యకర్తలపై దాడులు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యల ద్వారా న్యాయం సాధించేందుకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. భయపడకుండా నిజం కోసం నిలబడాలని, న్యాయ పోరాటం కొనసాగుద్దామని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ హక్కులు సమానమని, అవి కాపాడటానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ భేటీలో పార్టీ నేతలు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు. బాధితులకు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు.

# శ్రీశైలం పాదయాత్రలో ఉత్కంఠ క్షణాలు

- నల్లమల అటవీ మార్గంలో భక్తులకు పెద్దపులి ఎదురెదురు
- డోర్నాల సమీపంలో ఘటన
- అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచన



మార్కాపురం, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు నల్లమల అటవీ మార్గంలో భయంకరమైన అనుభవం ఎదురైంది. మార్కాపురం జిల్లా డోర్నాల మండలం పరిధిలోని పెద్దచెరువు సమీపంలో భక్తుల బృందానికి పెద్దపులి ఎదురుపడడంతో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. ఈ ఘటనతో యాత్రికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాలినడకన శ్రీశైలానికి వెళుతున్న భక్తులు మార్గమధ్యంలో పొదల్లో పెద్దపులిని గమనించారు. కొద్దిసేపు పులి భక్తులను గమనిస్తూ అక్కడే నిలబడటంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అటవీశాఖ అధికారుల సూచనల మేరకు భక్తులు పరుగులు తీయకుండా ప్రశాంతంగా నిల్చుండిపోయారు. ఇరువైపులా నిశ్శబ్దం నెలకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొంతసేపటి అనంతరం పులి నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోవడంతో భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. మల్లికార్జున స్వామి కృపతోనే ప్రమాదం తప్పిందని భావిస్తూ భక్తులు నినాదాలు చేస్తూ తమ యాత్రను కొనసాగించారు. అన్నదాన శిబిరానికి సరుకులు తీసుకెళుతున్న ఓ వాహనదారుడు ఈ ఘటనను తన మొబైల్‌లో చిత్రీకరించి ఇతర యాత్రికులకు చూపించి అప్రమత్తం చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంచారం సాధారణమే అయినప్పటికీ, యాత్రికులకు ఇలాంటి ముఖాముఖి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గుంపులుగా ప్రయాణించాలి, ఒంటరిగా వెళ్లకూడదని అటవీ అధికారులు సూచిస్తున్నారు. భక్తుల భద్రత కోసం అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అసెంబ్లీలో 11 నిమిషాలే... వైసీపీపై స్పీకర్ వ్యంగ్యం

- బడ్జెట్ సమావేశాల తొలి రోజే నిరసన
- సభా సంప్రదాయాలు పాటించాలని హితవు



అమరావతి, ఫిబ్రవరి 11 నేటిపత్రిక ప్రజాసీమ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరియు ఆ పార్టీ సభ్యులు సభకు హాజరయ్యారు. అయితే వారు సభలో సుమారు 11 నిమిషాలు మాత్రమే ఉండి నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. ఈ పరిణామంపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ సభ్యుల తీరుపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. “11వ తేదీన, 11 మంది, 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా” అంటూ వ్యాఖ్యానించారు. అదేవిధంగా సభ్యులు సభా సంప్రదాయాలను గౌరవించి పాటించడం మంచిదని స్పీకర్ సూచించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలే తప్ప సభ నుంచి బయటకు వెళ్లిపోవడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

# ఇండియాతో మ్యాచ్‌కు ఒప్పుకున్న పాక్‌పై హర్భజన్ సెటైర్లు



టీ20 వరల్డ్ కప్‌లో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న భారత్--పాకిస్థాన్ మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొదట భారత్‌తో మ్యాచ్ ఆడబోమని ప్రకటించి, తర్వాత మళ్లీ అంగీకరించడం పాక్ వైఖరిపై ప్రశ్నలు రేపుతోందని ఆయన అన్నారు. టోర్నమెంట్ ప్రారంభం కాకముందే ఈ మ్యాచ్‌పై తీవ్ర చర్చలు సాగాయి. రాజకీయ ఉద్రిక్తతలు, బోర్డు స్థాయి ప్రకటనలతో ఉత్కంఠ పెరిగింది. అయితే ఐసీసీ జోక్యంతో టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ అంగీకరించింది. ఈ నిర్ణయంపై స్పందించిన హర్భజన్ సింగ్, "రోజుకో మాట, గంటకొక స్టేట్‌మెంట్ ఎందుకు? ఇంత ఓవరాక్షన్ అవసరమా?" అంటూ ఎద్దేవా చేశారు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్థాన్‌కే ఎక్కువ నష్టమని, ఆ విషయం పీసీబీకి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. భారత్‌పై ఆధారపడకుండా పాకిస్థాన్ క్రికెట్ కొనసాగడం కష్టమని, కానీ భారత్ మాత్రం ఎప్పుడూ పాక్‌పై ఆధారపడదని అన్నారు. ప్రస్తుతం భారత జట్టు మంచి ఫామ్‌లో ఉండగా, పాకిస్థాన్‌పై ఒత్తిడి ఎక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి 15న జరిగే ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టీ20 వరల్డ్ కప్‌లో ఆసీస్‌కు షాక్.. గాయంతో కెప్టెన్ మార్ష్ ఔట్



టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టుకు టోర్నీ ప్రారంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్ ప్రాక్టీస్ సమయంలో గాయపడి కీలక మ్యాచ్‌కు దూరమయ్యాడు. గజ్జల్లో బంతి బలంగా తగలడంతో అతనికి అంతర్గత రక్తస్రావం జరిగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ఈ గాయంతో ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌కు మార్ష్ అందుబాటులో లేడు. అతని స్థానంలో ట్రావిస్ హెడ్ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపిస్తున్నాడు. మార్ష్‌కు తీవ్రమైన నొప్పి ఉండడంతో కొంతకాలం విశ్రాంతి అవసరమని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. వైద్యుల సూచనల మేరకు అతని తిరిగి రాకపై నిర్ణయం తీసుకోనున్నారు. ముందుజాగ్రత్త చర్యగా స్టాండ్‌బై ప్లేయర్‌గా ఉన్న స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను శ్రీలంకకు రావాల్సిందిగా జట్టు యాజమాన్యం సూచించింది. అవసరమైతే అతన్ని జట్టులో చేర్చే అవకాశం ఉంది. ఇప్పటికే హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ వంటి కీలక బౌలర్లు గాయాలతో దూరంగా ఉండగా, ఇప్పుడు కెప్టెన్ మార్ష్ గాయం ఆస్ట్రేలియా జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. అయితే మరోవైపు పేసర్ నాథన్ ఎల్లిస్ గాయం నుంచి కోలుకుని ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు సిద్ధమవడం ఆసీస్‌కు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. టోర్నీ ఆరంభ దశలోనే కీలక ఆటగాళ్లు గాయపడటం ఆస్ట్రేలియా అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# టీమిండియా మాపై 250 కొట్టే ప్రశ్నే లేదు:

## - నమీబియా యువ ఫాస్ట్ బౌలర్ హీంగో ధీమా

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం అరుణ్ జైట్లీ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో తలపడనున్న నమీబియా జట్టు ధీమాతో ఉంది. ముఖ్యంగా నమీబియా 18 ఏళ్ల యువ ఫాస్ట్ బౌలర్ మాక్స్ హీంగో చేసిన వ్యాఖ్యలు మ్యాచ్‌కు ముందు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. టీమిండియా ఎంత బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్నా సరే, తమ బౌలింగ్ ముందు భారీ స్కోర్ చేయలేరని హీంగో స్పష్టం చేశాడు. మ్యాచ్‌కు ముందు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హీంగో మాట్లాడుతూ.. "భారత్ మాపై 250 పరుగులు చేయడం అస్సలు సాధ్యం కాదు. గరిష్ఠంగా చూస్తే 180 పరుగుల వరకు మాత్రమే చేయగలరు. 300 పరుగుల సంగతి అయితే ఊహించడానికే లేదు" అంటూ ధైర్యంగా వ్యాఖ్యానించాడు. భారత బ్యాటర్లు దూకుడుగా ఆడినా, తమ ప్లానింగ్‌తో వారిని కట్టడి చేయగలమన్న నమ్మకాన్ని అతను వ్యక్తం చేశాడు. భారత్‌లో, భారత అభిమానుల మధ్య ఆడటంపై స్పందించిన హీంగో.. "50 వేల మందికి పైగా ప్రేక్షకులు ఉన్న స్టేడియంలో ఆడటం ఒత్తిడిగా ఉంటుంది. కానీ అదే సమయంలో అది అద్భుతమైన అనుభూతి కూడా. కాస్త నర్వస్‌గా ఉన్నా, నా ఆటపై నాకు నమ్మకం ఉంది. సహచరులు కూడా నాకు పూర్తి మద్దతు ఇస్తున్నారు" అని తెలిపాడు. ఇక నెదర్లాండ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌పై స్పందిస్తూ.. ఒక్క క్యాచ్ డ్రాప్ కారణంగానే ఆ మ్యాచ్‌ను కోల్పోయామని హీంగో వాపోయాడు. "అది మాకు చాలా నిరాశ కలిగించింది. అలాంటి చిన్న తప్పులు పెద్ద ఫలితాన్ని మార్చేస్తాయి. భారత్‌తో మ్యాచ్‌లో అలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా ఆడాలని నిర్ణయించుకున్నాం" అని అన్నాడు. నమీబియా జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా భారత మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ ఉండటం తమకు పెద్ద బలమని హీంగో పేర్కొన్నాడు. "2011లో భారత్‌కు ప్రపంచకప్ అందించిన కోచ్ అనుభవం మా జట్టుకు ఎంతో ఉపయోగపడుతోంది. ఆయన సూచనలు, మానసికంగా ఇచ్చే ధైర్యం మాకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయి" అని చెప్పాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన హీంగో.. పాఠశాల స్థాయిలో క్రికెట్ ఆడుతూ ప్రతిభను నిరూపించుకుని జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడాను తన ఆదర్శంగా తీసుకున్నానని, సీనియర్ బౌలర్లు రూబెన్ ట్రంపెల్‌మన్, జేజే స్మిత్‌ల నుంచి ఎంతో నేర్చుకుంటున్నానని వెల్లడించాడు. మొత్తంగా చూస్తే.. యువ బౌలర్ హీంగో ధీమా వ్యాఖ్యలతో భారత్--నమీబియా మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది. నిజంగా నమీబియా టీమిండియాను తక్కువ స్కోరుకే పరిమితం చేస్తుందా? లేక భారత బ్యాటింగ్ దూకుడు ముందు వారి ధీమా చల్లబడుతుందా? అన్నది మ్యాచ్ జరిగితేనే తేలనుంది.

# టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాకు ఎదురుదెబ్బ.. ఆసుపత్రిలో అభిషేక్ శర్మ




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం నమీబియాతో జరగనున్న మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ పొట్టలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రిలో చేరడంతో, ఈ మ్యాచ్‌కు అతడు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కడుపు నొప్పితో బాధపడుతున్న అభిషేక్‌ను సోమవారం ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మంగళవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు కూడా హాజరు కాలేదు. అభిషేక్ శర్మ ఆరోగ్య పరిస్థితిపై జట్టు సహాయక కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో స్పందిస్తూ, అతడు పొట్టలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు వెల్లడించారు. వైద్య పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాతే నమీబియాతో మ్యాచ్‌లో అతడి లభ్యతపై తుది నిర్ణయం తీసుకుంటామని జట్టు యాజమాన్యం తెలిపింది. యూఎస్ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లోనే జ్వరంతో బాధపడుతూ బరిలోకి దిగిన అభిషేక్ డకౌట్ అయ్యాడు. అనంతరం ఫీల్డింగ్‌కు కూడా రాలేదు. ఇక ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో, ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్‌తో కీలక మ్యాచ్‌లు ఉండటంతో, అతడి విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోకుండా విశ్రాంతినివ్వాలనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు సమాచారం. అభిషేక్ గైర్హాజరీతో ఓపెనర్‌గా సంజూ శాంసన్‌కు అవకాశం దక్కే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఇషాన్ కిషన్‌తో కలిసి సంజూ ఎక్కువ సమయం బ్యాటింగ్ చేయడం గమనార్హం. బుధవారం సాయంత్రం జరిగే చివరి ప్రాక్టీస్ తర్వాత తుది జట్టుపై స్పష్టత రానుంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు.. అగ్రస్థానాల్లో అభిషేక్, వరుణ్




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. బ్యాటర్ల జాబితాలో భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ 909 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో, పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని 25వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. బౌలర్ల విభాగంలో వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్ రెండో స్థానంలో ఉన్నాడు. శ్రీలంక ఆల్‌రౌండర్ వనిందు హసరంగ ఒక స్థానం ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరాడు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 11వ స్థానంలో నిలిచాడు. టీ20 ప్రపంచకప్‌లో ఒమన్‌పై అద్భుత ప్రదర్శన చేసిన జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా, పాకిస్థాన్ ఆటగాడు సైమ్ అయూబ్‌ను వెనక్కి నెట్టి ఆల్‌రౌండర్ల జాబితాలో తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బౌలింగ్‌లో కట్టుదిట్టంగా రాణించడంతో పాటు బ్యాటింగ్‌లోనూ జట్టుకు కీలక పాత్ర పోషించిన రజా మరోసారి తన సామర్థ్యాన్ని చాటుకున్నాడు.

# టీ20 వరల్డ్ కప్‌లో డబుల్ సూపర్ ఓవర్ థ్రిల్లర్..

## - ఆఫ్ఘన్‌పై సఫారీల సంచలన విజయం

టీ20 ప్రపంచకప్‌లో క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించిన అరుదైన పోరులో దక్షిణాఫ్రికా జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం ఏకంగా రెండు సూపర్ ఓవర్లు అవసరమవగా, చివరికి రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో సఫారీలు విజయం సాధించాయి. చివరి బంతి వరకు సాగిన ఈ ఉత్కంఠభరిత పోరు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసింది. మ్యాచ్ టైగా ముగియడంతో సూపర్ ఓవర్‌కు దారితీసింది. తొలి సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్థాన్ 17 పరుగులు చేయగా, ఛేదనలో దక్షిణాఫ్రికాకు చివరి బంతికి 6 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో ట్రిస్టన్ స్టబ్స్ సిక్సర్ బాదడంతో స్కోర్లు సమమయ్యాయి. దీంతో మ్యాచ్ రెండో సూపర్ ఓవర్‌కు వెళ్లింది. రెండో సూపర్ ఓవర్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ వరుస సిక్సర్లతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అనంతరం 24 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్థాన్ తరఫున రహ్మానుల్లా గుర్బాజ్ హ్యాట్రిక్ సిక్సర్లతో మ్యాచ్‌ను చివరి బంతి వరకు తీసుకెళ్లాడు. అయితే చివరి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆఫ్ఘన్ పోరాటం ముగిసింది. అంతకుముందు జరిగిన ప్రధాన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (59), ర్యాన్ రికెల్టన్ (61) అర్ధ సెంచరీలతో



రాణించారు. లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ కూడా 187 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. గుర్బాజ్ (84) అద్భుతంగా పోరాడినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు. ఈ మ్యాచ్ టీ20 క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే థ్రిల్లర్‌గా నిలిచింది.

# భారత్-పాక్ మ్యాచ్ ఎఫెక్ట్.. కొలంబోకు విమాన టిక్కెట్లు మూడింతలు




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే హై వోల్టేజ్ మ్యాచ్ ప్రభావం ప్రయాణ రంగంపై స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు భారీగా కొలంబోకు వెళ్లేందుకు సిద్ధమవుతుండటంతో విమాన టిక్కెట్ ధరలు అమాంతం పెరిగాయి. ముంబై--కొలంబో--ముంబై రూట్‌లో విమాన టిక్కెట్ ధర నిన్న ఉదయం రూ.60,000గా ఉండగా, ప్రస్తుతం మరింత పెరిగినట్లు సమాచారం. ముంబై నుంచి కొలంబోకు ఎకానమీ క్లాస్ టిక్కెట్ ధర సుమారు రూ.60,000 ఉండగా, ప్రీమియం ఎకానమీ ధర రూ.84,000 వరకు చేరుకుంది. శ్రీలంక ఎయిర్‌లైన్స్‌లో బిజినెస్ క్లాస్ టిక్కెట్లు రూ.1.34 లక్షల వరకు పలుకుతున్నాయి. సాధారణంగా రూ.30,000 పరిధిలో ఉండే ఢిల్లీ--కొలంబో టిక్కెట్ ధర ప్రస్తుతం రూ.90,000కు పెరగడం గమనార్హం. బిజినెస్ క్లాస్ టిక్కెట్ ధరలు రూ.1.92 లక్షల నుంచి రూ.2.25 లక్షల వరకు చేరుకున్నాయి. భారత్--పాక్ మ్యాచ్‌పై భారీ ఆసక్తి ఉండటంతో డిమాండ్ ఒక్కసారిగా పెరగడం దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. మొదట భారత్‌తో మ్యాచ్ ఆడబోమని ప్రకటించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, పలు దఫాల చర్చల అనంతరం మ్యాచ్‌కు అంగీకరించడంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. దీంతో విమాన టిక్కెట్లతో పాటు కొలంబోలో హోటల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. ఫిబ్రవరి 14, 15 తేదీల్లో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో డబుల్ బెడ్ రూమ్ ధరలు రూ.1.05 లక్షల నుంచి రూ.1.06 లక్షల వరకు ఉండగా, సాధారణ రోజుల్లో ఇవి రూ.40,000 నుంచి రూ.50,000 మధ్యలోనే ఉంటాయి.

# సముద్రపు దొంగల యుద్ధం మళ్లీ మొదలైంది...

## –'వన్ పీస్' సీజన్ 2 ట్రైలర్ రిలీజ్




ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ప్రతిష్టాత్మక లైవ్–యాక్షన్ సిరీస్ 'వన్ పీస్' రెండో సీజన్‌కు సంబంధించిన ట్రైలర్ విడుదలైంది. మొదటి సీజన్ సాధించిన భారీ విజయంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ సిరీస్ సీజన్ 2 మార్చి 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ విడుదలైన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. తాజా ట్రైలర్‌లో మంకీ డి. లూఫీ నాయకత్వంలోని 'స్ట్రా హాట్' పైరేట్స్ కొత్త సాహస ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు చూపించారు. అత్యంత ప్రమాదకరమైన 'గ్రాండ్ లైన్' సముద్ర మార్గంలోకి అడుగుపెడుతూ ప్రపంచంలోనే అత్యంత విలువైన నిధి 'వన్ పీస్' కోసం వారు చేసే సాహసాలు ఈ సీజన్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వింతైన దీవులు, కొత్త శత్రువులు, ఊహించని సవాళ్లు మరియు భారీ యాక్షన్ సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మొదటి సీజన్ కంటే ఈసారి యాక్షన్, ఎమోషన్, సస్పెన్స్ మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. జపాన్ రచయిత ఐచిరో ఓడా సృష్టించిన ప్రపంచ ప్రఖ్యాత మాంగా ఆధారంగా రూపొందిన ఈ సిరీస్, 2023లో విడుదలైన తొలి సీజన్‌తోనే ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని అందుకుంది. 75కి పైగా దేశాల్లో టాప్ స్థానంలో నిలిచి గ్లోబల్ ఫినామినన్‌గా మారింది. మాంగా, అనిమే అభిమానులతో పాటు కొత్త ప్రేక్షకులను కూడా ఈ సిరీస్ ఆకట్టుకుంది. ఇక సీజన్ 2లో అభిమానులందరికీ ఇష్టమైన 'టోనీ టోనీ చాపర్' పాత్ర లైవ్–యాక్షన్ రూపంలో ఎంట్రీ ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రధాన తారాగణంగా ఇనాకి గొడోయ్ (లూఫీ), మెకిన్యు (జోరో), ఎమిలీ రడ్ (నామి) తమ పాత్రల్లో కొనసాగుతుండగా, కొత్తగా కేటీ సాగల్, జో మాంగనీల్లో వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ విజువల్స్, అడ్వెంచర్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సీజన్ ప్రపంచవ్యాప్తంగా మరోసారి సంచలనం సృష్టిస్తుందా అన్న ఆసక్తి నెలకొంది.

# యోధుడిగా నిఖిల్... 'స్వయంభు' టీజర్ విడుదల




యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' టీజర్ విడుదలై సినీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుండగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచింది. అత్యున్నత సాంకేతిక విలువలతో 3ఙ ఫార్మాట్‌లో రూపొందించిన ఈ టీజర్ విజువల్‌గా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 కాలానికి చెందిన పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్లు, పీరియడ్ నేపథ్యంతో రూపొందించిన యుద్ధ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్‌లు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. నిఖిల్ లుక్, బాడీ లాంగ్వేజ్, యుద్ధ విన్యాసాలు పాత్రకు తగిన విధంగా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'కార్తికేయ–2' విజయానంతరం నిఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో ప్రత్యేక దృష్టి నెలకొంది. ఈ చిత్రంలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తుండగా, 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ అందించిన విజువల్స్ టీజర్‌కు మరింత గ్రాండ్ లుక్ తీసుకొచ్చాయి. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్, యాక్షన్ ఎలిమెంట్స్, ఎమోషనల్ స్టోరీతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నిఖిల్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందా అన్న ఆసక్తి సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న 'స్వయంభు' చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సృష్టించగా, టీజర్‌కు వస్తున్న స్పందన చూస్తే విడుదల తర్వాత కూడా మంచి స్పందన దక్కే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# నటి నుంచి డాక్టర్‌గా... మెడిసిన్ పట్టా అందుకున్న టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. వెండితెరపై వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారింది. మెడికల్ విద్యలో భాగంగా ఎంబీబీఎస్ డిగ్రీను విజయవంతంగా పూర్తిచేసిన శ్రీలీల, తాజాగా జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమంలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నటిగా బిజీ షెడ్యూల్ మధ్య కూడా చదువును కొనసాగించడం సులభం కాదని తెలిసినా, లక్ష్యంపై దృష్టి పెట్టి శ్రీలీల కృషి చేసింది. గత ఏడాది చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, షూటింగ్‌ల మధ్య దొరికిన సమయాన్ని చదువుకు కేటాయిస్తూ మెడికల్ విద్యను పూర్తి చేసింది. ఆమె క్రమశిక్షణ, పట్టుదల ఇప్పుడు యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలతను స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేసినట్లు గతంలో పలుమార్లు తెలిపింది. చిన్నతనంలో తన కుటుంబంలో జరిగిన ఆరోగ్య సమస్యలు చూసిన తర్వాత వైద్యురాలిగా సేవ చేయాలన్న కోరిక తనలో పెరిగిందని ఆమె చెప్పింది. ఆ లక్ష్యాన్ని నేడు సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సమీప వర్గాలు వెల్లడిస్తున్నాయి. సినిమాల్లో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూ చదువును కూడా సమానంగా ముందుకు తీసుకెళ్లడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఒక వైపు స్టార్ హీరోయిన్‌గా రాణిస్తూ, మరోవైపు మెడికల్ డిగ్రీ సాధించడం అరుదైన విషయం అని సినీ ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో నటిగా కొనసాగుతూనే వైద్య సేవలు కూడా అందించాలన్న శ్రీలీల సంకల్పం అభిమానుల్లో మరింత గౌరవాన్ని పెంచుతోంది.

# వైరల్ ప్రోటోకాల్ ప్రచారంపై అల్లు అర్జున్ టీమ్ ఆగ్రహం

## – బాధ్యులపై పరువు నష్టం కేసుకు సిద్ధం



టాలీవుడ్ ప్రముఖ నటుడు, పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్‌కు సంబంధించిన ఓ వైరల్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. నటుడిని కలవాలంటే 42 కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొంటూ వచ్చిన ప్రచారం నెట్టింట కలకలం రేపింది. ఈ వివాదంపై తాజాగా అల్లు అర్జున్ టీమ్ అధికారిక ప్రకటన విడుదల చేసి ఆరోపణలను ఖండించింది. 'గంగోత్రి' సినిమాతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన అల్లు అర్జున్, తన కృషి, పట్టుదలతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఆరంభంలో లుక్‌పై విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, తర్వాతి చిత్రాలతో నటుడిగా, డ్యాన్సర్‌గా తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా 'పుష్ప' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు పొందారు. అభిమానులతో సన్నిహితంగా మెలగడం, వినయంతో ఉండడం ఆయన వ్యక్తిత్వంలో ప్రధాన లక్షణాలుగా అభిమానులు చెబుతుంటారు. ఇలాంటి నేపథ్యంలో ఇటీవల సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అయింది. అందులో అల్లు అర్జున్‌ను కలవడానికి 42 ప్రత్యేక నిబంధనలు అమలులో ఉన్నట్లు ప్రచారం జరిగింది. మీడియా ప్రతినిధులు, కార్పొరేట్ అధికారుల కోసం రూపొందించిన ప్రోటోకాల్‌లో "కళ్లలోకి నేరుగా చూడకూడదు, షేక్‌హ్యాండ్ చేయకూడదు, అనుమతి లేకుండా మాట్లాడకూడదు, మధ్యలో కదలకూడదు" వంటి నియమాలు ఉన్నట్లు వీడియోలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాయల్ ఎన్‌ఫీల్డ్ మాజీ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ కావేరి బారువా ఒక పాడ్‌కాస్ట్‌లో చేసిన వ్యాఖ్యల ఆధారంగా వైరల్ అయ్యాయి. వీడియో బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వెల్లువెత్తాయి. కొందరు నెటిజన్లు విమర్శలు చేయగా, మరికొందరు ట్రోలింగ్‌కు దిగారు. అదే సమయంలో అల్లు అర్జున్ అభిమానులు ఈ ప్రచారాన్ని ఖండిస్తూ తమ హీరో వ్యక్తిత్వానికి విరుద్ధమని పేర్కొన్నారు. వివాదం ముదరడంతో అల్లు అర్జున్ టీమ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అందులో ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని స్పష్టం చేశారు. "అల్లు అర్జున్ ఎప్పుడూ అందరితో గౌరవప్రదంగా, హుందాగా ప్రవర్తిస్తారు. ఆయన వ్యక్తిత్వానికి విరుద్ధంగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. ధృవీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దు" అని పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం కేసు వేయడానికి తమ లీగల్ టీమ్ సిద్ధంగా ఉందని కూడా వెల్లడించారు. ఈ ప్రకటనతో వివాదం ఎంతవరకు చల్లారుతుందో చూడాలి. అయితే సినిమాల వల్ల కాకుండా సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియో కారణంగా అల్లు అర్జున్ వార్తల్లో నిలవడం ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రమేష్ బాబు వారసుల ఎంట్రీపై పెరుగుతున్న ఆసక్తి...

## – హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనున్న భారతి..?



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. 'వారణాసి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచగా, మహేష్ బాబు లుక్, రాజమౌళి మేకింగ్ స్టైల్‌పై సినీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మహేష్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో తరం సినీ రంగంలోకి అడుగుపెట్టబోతుందా అన్న చర్చలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మహేష్ బాబు అన్న రమేష్ బాబు కూడా ఒకప్పుడు హీరోగా ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే. బాల నటుడిగా 'అల్లూరి సీతారామరాజు' సినిమాలో కనిపించిన రమేష్ బాబు, అనంతరం 'సామ్రాట్' సినిమాతో హీరోగా పరిచయం అయ్యారు. తన కెరీర్‌లో పలు చిత్రాల్లో నటించిన ఆయన చివరిసారిగా 1997లో వచ్చిన 'ఎన్‌కౌంటర్' సినిమాలో కనిపించారు. ఆ తర్వాత నటనకు దూరమై నిర్మాతగా మారి, మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన 'అర్జున్', 'అతిథి', 'దూకుడు' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. రమేష్ బాబు 2022 జనవరి 8న కాలేయ సంబంధిత వ్యాధితో కన్నుమూసిన సంగతి తెలిసిందే. అన్నపై మహేష్ బాబుకు ఎంతో అనుబంధం ఉండేది. అయితే రమేష్ బాబు మరణ సమయంలో మహేష్ బాబుకు కరోనా సోకడంతో చివరి చూపు కూడా దక్కకపోవడం అభిమానులను కలచివేసింది. కుటుంబానికి, అభిమానులకు ఇది పెద్ద లోటుగా మారింది. ఇప్పుడు రమేష్ బాబు వారసుల సినీ ఎంట్రీపై ఆసక్తి పెరుగుతోంది. ఆయన కుమారుడు జయకృష్ణ హీరోగా పరిచయం కావడానికి సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'శ్రీనివాస మంగాపురం' అనే చిత్రంలో ఆయన నటించనున్నట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కృష్ణ కుటుంబం నుంచి మరో హీరో రావడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇదే సమయంలో రమేష్ బాబు కుమార్తె భారతి ఘట్టమనేని పేరు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమెకు సినిమాలపై ఆసక్తి ఉందా లేదా అన్నది స్పష్టంగా తెలియకపోయినా, ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆమె ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. హీరోయిన్‌లా కనిపిస్తోందని, భవిష్యత్తులో ఇండస్ట్రీలోకి వస్తే మంచి అవకాశాలు ఉంటాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం చదువుల్లో బిజీగా ఉన్న భారతి, భవిష్యత్తులో సినీ రంగాన్ని ఎంచుకుంటుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. కృష్ణ కుటుంబం నుంచి ఇప్పటికే మహేష్ బాబు టాలీవుడ్‌లో సూపర్ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోగా, ఇప్పుడు తదుపరి తరం కూడా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుందా అన్న చర్చలు జోరందుకున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవన్నీ ఊహాగానాలుగానే ఉన్నప్పటికీ, అభిమానుల్లో మాత్రం ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.

# కుంభమేళా బ్యూటీ గొప్ప నిర్ణయం...

## –తొలి పారితోషికంతో పాఠశాల ప్రారంభం



మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరల్ అయి అందరి దృష్టిని ఆకర్షించిన "కుంభమేళా బ్యూటీ" మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో గొప్ప నిర్ణయం తీసుకుని ప్రశంసలు అందుకుంటోంది. తన తొలి సినిమా ద్వారా వచ్చే పారితోషికాన్ని బాలికల విద్య కోసం వినియోగిస్తూ పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించడం సినీ వర్గాలతో పాటు సామాజిక వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. సాధారణ జీవితంలో నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా మోనాలిసా పూసల దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె ఒక్కసారిగా గుర్తింపు పొందింది. సాధారణ అమ్మాయిగా జీవనం సాగిస్తున్న ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు రావడం ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రస్తుతం సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస అవకాశాలతో బిజీగా మారుతున్న మోనాలిసా, తన విజయాన్ని సమాజానికి ఉపయోగపడేలా మార్చాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇటీవల తన తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన గతాన్ని ఎప్పటికీ మర్చిపోనని, కష్టాలే తనకు ధైర్యం ఇచ్చాయని పేర్కొంది. తన జీవితాన్ని మార్చిన ప్రయాగ్‌రాజ్‌కు ఇటీవల మళ్లీ వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మోనాలిసా, అక్కడి అనుభవాలు తనలో సామాజిక బాధ్యతను పెంచాయని చెప్పింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాలను స్థాపించాలన్నదే తన లక్ష్యమని ఆమె వెల్లడించింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేక చదువు మధ్యలోనే ఆగిపోతున్న పరిస్థితులు ఉన్నాయని, అలాంటి పిల్లలకు విద్య అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలని నిర్ణయించుకున్నానని స్పష్టం చేసింది. ప్రస్తుతం మోనాలిసా మూడు సినిమాలతో బిజీగా ఉన్నట్లు సమాచారం. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ స్థాయి నుంచి వచ్చిన యువతి సమాజానికి తిరిగి ఏదో చేయాలన్న ఆలోచనతో ముందుకు రావడం ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

Published and Owned by VASANTHA LAKSHMI NARASAMMA, Printed at M/s. VSAR PUBLICATIONS, D.No. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR KADAPA DISTRICT, ANDHRA PRADESH - 516002. and Published from 41/1077, SANKARAPURAM, KADAPA, YSR KADAPA DISTRICT, ANDHRA PRADESH - 516002.
Editor : VASANTHA LAKSHMI NARASAMMA, PRGI No.APTEL/26/A0819, Cell No: 9492920484, E-mail: netipatrikaprajaseema@gmail.com